క్లుప్తంగా

ప్రభుత్వ విద్యారంగంలో పలు సంస్కరణలు

కొత్తగూడెంఅర్బన్: పాఠశాల విద్యారంగంలో పలు సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల రోజువారీ హాజరు మెరుగుదలకై ఎఫ్ఆర్ఎస్ ప్రవేశపెట్టిందని, విద్యార్థులకు ఉచితంగా పలు సౌకర్యాలను కల్పిస్తోందని కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాళ్ తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యారంగంలోని పథకాల పనితీరు – అమలు పట్ల పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతీనెల రివ్యూలు నిర్వహించాలని ఆదేశాలున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, లైబ్రరీ పుస్తకాలు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, యూనిఫాం గురించి అడిగి తెలుసుకున్నారు.

'ఉల్లాస్' పథకంపై శిక్షణ

టేకులపల్లి: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా ప్రతీఒక్కరు కృషి చేయాలని టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ పథకం అమలుపై శిక్షణ నిర్వహించారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం ఉల్లాస్ పథకం లక్ష్యాలన్నారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక విద్య, సమానత్వాన్ని అందించటంతో పాటు సంపూర్ణ వయోజన విద్యా కోర్సుల ద్వారా నిరంతర విద్యను ప్రోత్సహించడం ఉల్లాస్ పథకం ఉద్దేశమన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. బోధించేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద టీచర్లను గుర్తించాలని, ఈనెల 28 నుంచి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

న్యాయవాదిపై దాడికి నిరసన

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై దాడికి నిరసనగా మంగళవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి మద్దతును తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదిపై దాడి హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు అన్ని బార్ అసోసియేషన్లు విధులు బహిష్కరించినట్లు చెప్పారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జే.గోపికృష్ణ, బాగం మాధవరావు, కాసాని రమేష్, మాలోతు ప్రసాద్, ఉప్పు అరుణ్, ఆడపాల పార్వతి, కె.చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వండి..

టేకులపల్లి: ప్రభుత్వం భూభారతి ద్వారా ఇటీవల స్వీకరించిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రైతుల భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకుడు భూక్యా హర్జ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తులదారుల భూములకు సర్వే నిర్వహించి సంవత్సరం పూర్తయినా ప్రభుత్వం రైతులకు పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. ఆగస్టు 15వరకు సర్వే అయిన ప్రతీ రైతుకు పట్టాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేటికీ ఆ ఊసే లేదన్నారు. ఎట్టి నరసింహారావు, భూక్యా నర్సింగ్, అనంతోజు చంద్రాచారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి..

జూలూరుపాడు: కొమ్ముగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పనులు తక్షణమే చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకుల బృందం కొమ్ముగూడెం గ్రామంలో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు పూడికతో నిండి మురుగు రోడ్లపై ప్రవహించడంతోపాటు, వీధుల్లో చెత్తను సీపీఎం నాయకులు పరిశీలించారు. మాట్లాడుతూ నెలల తరబడి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైందని, వర్షాలు కురుస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యాసా నరేష్, శంకర్, రవి, మంగ్యా, చిన్న మంగా, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ వేధిస్తోందని ఫిర్యాదు

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియా, సంజయ్‌నగర్, సీఎస్పీ బస్తీ ఏరియాకు చెందిన సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ స్వర్ణలత తమను వేధిస్తోందని ఆరోపిస్తూ గ్రామ సంఘాల సహాయకుల (వీఓఏ) సంఘం ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఫిర్యాదు చేశారు. తమపై అదనపు పనిభారం మోపుతూ ఒత్తిడికి గురిచేయడమే కాకుండా వ్యక్తిగతంగానూ ఇబ్బంది పెడుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో విచారణ చేయించి తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

వినాయక చవితి శోభ..

నేటి నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం ● స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

కొత్తగూడెంటౌన్: వినాయక చవితి పండుగకు చిన్నాపెద్ద మండపాల వద్ద చేసే సందడితో శోభాయమానంగా ఉంటుంది. బుధవారం గణేష్ నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 7 వరకు మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయాల్లో, వీధుల్లోని మండపాల్లో కొలువుదీరనున్న వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. తొమ్మిది రోజుల పాటు విశిష్ట పూజలు అందుకోనున్నారు. మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో దాదాపుగా 500 వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు పోలీస్, విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం, కూలీలైన్, శ్రీనగర్‌కాలనీ, మేదరబస్తీ, గణేష్‌టెంపుల్, బస్టాండ్ ఏరియా, పాత కొత్తగూడెం, హెడ్ ఆఫీస్ ఏరియా, రైటర్‌బస్తీ, పోస్టాఫీస్ ఏరియా, చుంచుపల్లి విద్యానగర్ కాలనీ, రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్, పెనగడపలతో పాటు పలు వాడల్లో గణనాథుడు కొలువుదీరనున్నాడు.

గణేష్ టెంపుల్‌లో.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో బుధవారం నుంచి గణేష్ నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నవరాత్రుల బ్రహ్మోత్సవాలను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని ఆలయ ఈఓ రజనీకుమారి మంగళవారం తెలిపారు. దేవస్థానం, పొల్యూషన్ బోర్డు సహాయంతో ఎస్ఆర్‌కేటీ స్కూల్, వివేకానంద విద్యాలయం విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాలను ఆలయ ఈఓ రజనీకుమారి ఆధ్వర్యంలో స్థానికులకు పంపిణీ చేశారు.

శ్రీచండీసర్వజ్ఞ పీఠంలో మట్టి వినాయకుడు..
కొత్తగూడెం శ్రీనగర్‌కాలనీలోని శ్రీచండీసర్వజ్ఞ పీఠంలో వేదపండితులు దండిబొట్ల రామాంజనకుమారశర్మ వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. బుధవారం ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు.


ఇల్లెందు: అంబజార్‌లోని వినాయక మండపం


కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఈఓ రజనీకుమారి

పాల్వంచరూరల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో గణనాథుడికి పూజలు ప్రత్యేకం. తీరొక్క పూలతో అర్చనలు, పూజలు నిర్వహిస్తారు. నేడు వినాయక చవితి సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేశారు. బుధవారం వివిధ రూపాల్లో విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించనున్నారు.

జూలూరుపాడు: బుధవారం వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. తలచిన కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాలంటే ఆ విఘ్ననాయకుని అనుగ్రహం తప్పనిసరి. దైవారాధనలో, పూజాధికాలంలో, సర్వ శుభకార్యాలకు తొలిపూజలందుకునే దేవుడు శ్రీగణపతి. భక్తులకు ముక్తినిచ్చే మోక్షప్రదాత వినాయకుడు. సర్వవిఘ్నాలు తొలిగించే వినాయక చవితి పండుగ సందర్భంగా తొమ్మిది రోజులు పాటు ఘనంగా నిర్వహించే శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో వాడవాడాలా గణేష్ నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. మండల కేంద్రం జూలూరుపాడులో వ్యాపారులు రెండు అడుగుల ఎత్తు నుంచి 10 అడుగుల వరకు వివిధ రూపాల విగ్రహాలను అమ్ముతున్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి..
గణేష్ ఉత్సవ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జూలూరుపాడు బాదావత్ రవి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాలకు విద్యుత్, మైకు పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు.

ఇల్లెందు: పట్టణంలో వినాయక చవితి వేడుకలకు మండపాలు ముస్తాబయ్యాయి. మంగళవారం వినాయక చవితి సందర్భంగా గణనాథుడికి పూజలు చేయనున్నారు. ఈ మేరకు సింగరేణి ఏరియా జీఎం వీసం కృష్ణయ్య మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఇక ఆయా వార్డులలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కొత్త బస్టాండ్, ఇందిరానగర్, అంబజార్, సత్యనారాయణపురం, నెంబర్ – 2 బస్తీ, స్టేషన్ బస్తీ, వినోభానగర్ ఏరియా, కూరగాయల మార్కెట్‌లలో మండపాలు వెలిశాయి.

టేకులపల్లి: బుధవారం ప్రారంభం కానున్న చవితి వేడుకలకు మండపాలు సిద్ధం అయ్యాయి. టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో చిన్నవి, పెద్దవి కలిపి సుమారు రెండు వందల వరకు వినాయక మండపాలు ఏర్పాటయ్యాయి. వేడుకల కోసం మండపాలను ముస్తాబు చేశారు.


జూలూరుపాడు: కొమ్ముగూడెంలో..


పాల్వంచరూరల్: అమ్మకానికి పూజాపత్రి


టేకులపల్లి సెంటర్‌లో గణేష్ మండపం

మట్టి ప్రతిమలు ఎంతో మేలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయశాఖ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. కొత్తగూడెం రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రవికుమార్, కొత్తగూడెం జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లగడపాటి సురేష్, కోర్టు పీసీ సిస్టమ్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో
సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సేవా సమితి ఆధ్వర్యంలో సింగరేణి హెడ్డాఫీస్, మిలీనియం క్వార్టర్స్, మెయిన్ ఆస్పత్రి ఆవరణలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవి కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు డీజీఎం కేశనారాయణరావు భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ ఆఫీసర్ కే.ఉదయ్‌కుమార్, వెల్ఫేర్ పీఏ వరప్రసాద్, సేవా కోఆర్డినేటర్ షరీఫ్, సేవా కోఆర్డినేటర్లు మునీల, సుజాత, స్వర్ణలత, మీనాకుమారి, రమాదేవి, పద్మావతి, ఇందుమతి పాల్గొన్నారు.

పాల్వంచ: పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలు ఎంతో మేలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీ ఫౌండేషన్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పము పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం, ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు, శ్రావణ్, కిరణ్, సంగ్లోతు రంజిత్, నవీన్, మీరావలి, ప్రమోద్, ప్రవీన్, ఉదయ్ కృష్ణ, సదానందం తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో మంగళవారం కేఎస్‌పీ రోడ్‌లో అక్షయ మోటర్స్ ఎలక్ట్రికల్ బైక్ షోరూం వద్ద ములకలపల్లి తహసీల్దార్ భూక్యా గన్యా నాయక్, శ్రీ లక్ష్మీ గోల్డ్ షాపు యజమాని పసుమర్తి రాము చేతుల మీదుగా వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. సపావత్ బాలకృష్ణ చౌహాన్, శంకర్, గుగులోతు భద్రు, శంకర్ రాథోడ్, చిరంజీవి, జయరాం పాల్గొన్నారు. కేఎస్‌పీ రోడ్‌లో ఆర్ఆర్ నేత్రాలయ వద్ద మట్టి ప్రతిమలను కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ పంపిణీ చేశారు. డాక్టర్ అల్లమోలు భగవాన్, డాక్టర్ వనపర్తి హరికృష్ణ, డాక్టర్ అశోక్, చింతా నాగరాజు పాల్గొన్నారు.


పాల్వంచ: మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచరూరల్: పర్యావరణాన్ని సమతుల్యం చేసే మట్టి వినాయక విగ్రహాలనే పూజించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మట్టి విగ్రహాలు తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పర్యావరణ హితంగా జరుపుకోవాలనే అవగాహన కోసం కళాశాలలో గణేశ్ విగ్రహాలను మట్టి, పిండి, వివిధ రకాల పత్రిలతో తయారు చేసినట్లు తెలిపారు. కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ జె.మాధవి, డాక్టర్ టి.అరుణకుమారి, డి.రమేష్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో...
ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి చేతుల మీదుగా మంగళవారం మట్టి గణేష్ విగ్రహాలను స్థానికులకు అందజేశారు. అధికారులు గిరిధర్‌రావు, నరసింహరాజు, జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారాం, రవికుమార్, దిలీప్‌కుమార్, రాందాస్, శ్యాం ప్రసాద్, అజయ్ పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: గణేష్ ప్రతిమలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు


పాల్వంచ: గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ

సింగరేణిలో స్ట్రక్చరల్ కమిటీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో జీఎం కార్యాలయంలో మంగళవారం యాజమాన్యంతో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో స్ట్రక్చరల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం శాలేంరాజు పాల్గొన్నారు. నాయకులు పలు డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, జి.సీతారామరాజు, పోశం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, డీజీఎం జీవీ మోహన్‌రావు, యోహాన్ (ఐఈడీ), జేవీఆర్‌ఓసీ పీఓ ప్రహ్లాద్, మెడికల్ సూపరింటెండెంట్ పరశురాములు పాల్గొన్నారు.

'ప్రయాస్' సమావేశం
కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎంపీఎఫ్ అధికారుల సమన్వయ, మూడో దశ ప్రయాస్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీ.వీ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీ–కేర్స్ ద్వారా రీఫండ్, పెన్షన్ క్లెయిమ్‌ల్లో తప్పులు లేకుండా సమర్పించడంతో పాటు సీఎంపీఓ ద్వారా సవరించిన పీపీఓ వితంతు పెన్షన్ క్లెయిమ్‌లను నేరుగా అందించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉద్యోగ విరమణ చేసేవారు నిర్ణీత ఫార్మెట్‌లో సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో రీజినల్ కమిషనర్లు వంశీధర్ కుసుంబ, ఎం.కనకమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఇన్సూరెన్స్ కల్పించండి..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: కార్మికులకు, పీఎఫ్, ఇన్సూరెన్స్, మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.12 వేల తక్షణమే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఇల్లెందు లేబర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. షాపుల గుమస్తాలు, పెట్రోల్ బంక్, గ్యాస్ గోడౌన్లు, మిల్లు వర్కర్లు, ప్రైవేట్ స్కూల్ టీచింగ్ స్టాఫ్, ప్రైవేట్ ఆస్పత్రి, లాబ్ వర్కర్లు, ప్రైవేట్ సెక్యూరిటీగార్డులు, హోటల్, బేకరీ మాస్టర్లు, హెల్పర్లు, ఇటుక బట్టి, కాంట్రాక్ట్ కార్మికులు, బిల్డింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు నబీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణ, శేఖర్, కామ నాగరాజు, మహమూద్, శివకృష్ణ, రాజు, భాస్కర్, సతీష్, పవన్, సత్యనారాయణ కోరీ, సురేష్, నరేష్, ఆదిత్య, సాయిలు, డానియేల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి..

పాల్వంచ: మున్సిపల్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు నవభారత్ గాంధీనగర్‌లో ప్రజా సమస్యలపై సర్వే చేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు సరిగా లేవని, మిషన్ భగీరథ నీళ్లు ఇస్తామని పైపులైన్‌లు కొంతవరకు వేసి వదిలేశారని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదన్నారు. అనంతరం మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల స్థానిక అవసరాలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కనీస అవసరాలు తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు వేయడంలో తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, మందనపు జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, దొడ్డా రవికుమార్, తులసీ రామ్, కె.సత్య, బి.కాంతి, బి.మాధవి, పద్మ, అపర్ణ, మేరి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత, పనిస్థలాల్లో రక్షణ కల్పించాలని, హైపవర్ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎస్.సంజీవ్ అన్నారు. మంగళవారం రైటర్‌బస్తీలోని ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాలలో సుమారు 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతన చట్టాలు అమలు చేయటం లేదన్నారు. కోలిండియాలో అమలు చేస్తున్న హైపవర్ వేతనాలు సింగరేణిలో అమలు చేయాలన్నారు. పదేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచకపోవటం గర్హనీయమన్నారు. ఫలితంగా చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తామన్నా కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. కనీస వేతనాల అమలు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధనకు సెప్టెంబర్ 7న జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోతుక్కూరు మల్లికార్జున్‌రావు, కొండపల్లి శ్రీను, రాధ, అవినాష్, కరుణ, సంధ్య, మంగీలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేషనల్ స్పోర్ట్స్ డే సంబురాలలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు చెస్, క్యారెమ్స్ పోటీలు నిర్వహించారు. డీఆర్‌డీఓ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, డీవైఎస్ఓ పరంధామరెడ్డి, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, పీడీ పూర్ణచందర్‌రావు, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీకృష్ణ, ఆర్చరీ కోచ్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి

పాల్వంచరూరల్: ఇంటికి వెళ్తున్న ఫొటోగ్రాఫర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన ఇది. మండలంలోని బస్వతారక కాలనీ శివారు గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ భాషబోయిన మురళీకృష్ణ సోమవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఆరుగురు యువకులు దాడి చేసి ఫోన్ లాక్కున్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురంలో మాజీ జెడ్పీటీసీ నందనాయక్ తన ద్విచక్రవాహనాన్ని ఈనెల 18న ఇంటి ముందు పార్క్ చేయగా కాసేపటికి చోరీ జరిగింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనులపై పర్యవేక్షణ లేమి!

ఇల్లెందురూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రాథమిక జాగ్రత్తలను సైతం విస్మరిస్తున్నారు. మండలంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రజావేదికలో సౌకర్యాలు కొరవడటంతో తనిఖీ బృందం సభ్యులు తమ నివేదికలు చదివేందుకే పరిమితం అయ్యారు. పలు గ్రామపంచాయతీలలో రోజ్‌గార్ దివస్ కార్యక్రమ నిర్వహణను విస్మరించారని, ఒకే కుటుంబంలో ఒకరికి మించి జాబ్‌కార్డులు జారీ చేశారని, నాటిన మొక్కలకు అదనపు వేతనం చెల్లించారని, పేమెంట్ పూర్తి చేసిన తరువాత పనులు చేశారని, సిటిజన్ చార్టర్ ప్రదర్శించలేదని, మన ఊరు– మన బడి, సీసీ రహదారుల రికార్డులు చూపించలేదని, పనులు చేపట్టకముందే ఎంబీ రికార్డులు పూర్తి చేశారని, పనుల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేయలేదని తమ నివేదికలో సభకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ రవి, విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏపీఓ శంకర్, సామాజిక తనిఖీ ప్రతినిధులు అనూష, రాజశేఖర్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆశయాలు సాధించాలి

పాల్వంచ: విశ్వమాత మదర్ థెరిస్సా పేదలకు, అభాగ్యులకు చేసిన సేవలు మరువలేనివని అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కటుకూరి శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం థెరిస్సా 115వ జయంతి పురస్కరించుకుని కేటీపీఎస్ ప్రాజెక్ట్ హాస్టల్ వద్ద మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బోగిని సందీప్, కిన్నెర శ్రీను, రావుల మురళీ, జయరాజు, విజయకుమారి, మంగ, వంశీ, వెంకటేశ్వర్లు, జీవన్‌కుమార్, అన్వేష్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): నోబెల్ బహుమతి గ్రహీత, విశ్వమాత మదర్ థెరిస్సా 115వ జయంతి వేడుకలు మంగళవారం రుద్రంపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరమణ హాజరయ్యారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ, గూడెల్లి యాకయ్య, రాధ, రజియా సుల్తానా, కే.వెంకటేశ్వర్లు, గణేష్, చారీ, ధీరజ్, చిన్ని, విజయరాజ్, శ్రీనివాస్, బొజ్జం సంపత్ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న శేఖర్‌బాబు

పర్యవేక్షణ నామమాత్రం.. పంపిణీ అస్తవ్యస్తం

- యూరియా విక్రయాల్లో కొరవడిన నిబంధనలు
- నేటికీ బారులు తీరుతున్న రైతులు

ఇల్లెందురూరల్: పంటల సాగు విస్తీర్ణానికి మించి యూరియా వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు యూరియా కోసం నేటికీ బారులు తీరుతున్నారు. వచ్చిన యూరియా ఎటుపోతోందనేది ప్రశ్నార్థకంగా మారింది. పంపిణీ చేస్తున్న యూరియాను ఎవరూ పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినపడుతున్నాయి. మండలంలో వాస్తవ సాగు విస్తీర్ణం ఎంత..? ఇప్పటి వరకు రైతులకు ఎంత యూరియా పంపిణీ చేశారు..? వంటి లెక్కలు ఎవరి వద్దా లేకపోవడం యూరియా విక్రయాలలో నిఘా వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది.

అధిక ధరలు.. అదనపు మందులు
అనావృష్టితో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పత్తి, మొక్కజొన్న సాగు నెల రోజులు ఆలస్యంగా ప్రారంభం కావడం, అతివృష్టితో కొంత ముందుగానే వరినాట్లు ప్రారంభం కావడం వంటి కారణాలతో యూరియా వినియోగం ఒకేసారి గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన యూరియాలో 60శాతం మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌లకు, 40 శాతం ప్రైవేటు వ్యాపారులకు సరఫరా చేస్తోంది. ఈ లెక్కన ఇల్లెందు మండలానికి 2,727 మెట్రిక్ టన్నులు సరఫరా కాగా అందులో పీఏసీఎస్‌కు 1400 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు వ్యాపారులకు 1,327 మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. అయితే పీఏసీఎస్‌లో యూరియాతోపాటు నానోయూరియా కూడా విక్రయిస్తుండగా ప్రైవేటు వ్యాపారులు మాత్రం యూరియా వాస్తవ ధర రూ.266 ఉండగా రూ.400 నుంచి రూ.450 వరకు పెంచడంతోపాటు అదనంగా నానోయూరియా, కాంప్లెక్స్ ఎరువులు, జింకు, నీటిలో కరిగే ఎరువులు కూడా ఇస్తామని షరతు పెడుతున్నాయి. దీంతో రైతులు ప్రభుత్వ నిర్దేశిత ధరకు లభ్యమవుతున్న పీఏసీఎస్ విక్రయ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇదికూడా విక్రయ కేంద్రాలలో రైతుల రద్దీకి కారణమవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎవరికి విక్రయిస్తున్నారో..
పీఏసీఎస్ ద్వారా మండలంలోని కొమరారం, నిజాంపేట, ఇల్లెందులోకి వ్యవసాయ మార్కెట్ యార్డులలో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా విక్రయ కేంద్రాలలో కొనుగోలు చేసేలా ప్రాంతాలను కేటాయించారు. ఆయా కేంద్రాలలో ఈపాస్ యంత్రం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ సంఖ్య ఆధారంగా రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. ఏ రైతుకు.. ఎంత యూరియా.. ఇచ్చామనేది ఎక్కడా ఎవరూ నమోదు చేసుకోవడం లేదు. ఈపాస్ యంత్రంలోనూ అంతకు ముందు ఇచ్చిన యూరియా ఎక్కడా చూపడం లేదు. దీంతో వచ్చిన వారే మళ్లీ మళ్లీ రావడం, రైతులు కాకుండా ఇతరులు సైతం వరుసలో నిలబడి యూరియా తీసుకెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా కొందరు దళారులు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక ధరలకు నేరుగా ఇంటికే సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విధానంలో విక్రయ కేంద్రం వద్ద బారులు తీరి కొనుగోలు చేస్తున్న వ్యక్తికి రోజు కూలీ గిట్టుబాటు అయ్యేలా దళారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.


యూరియా కొనుగోలు కోసం క్యూలో రైతులు

విక్రయాలను పర్యవేక్షిస్తున్నాం..



యూరియా విక్రయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రైవేటు దుకాణాల వద్ద ధరను సూచిస్తూ ఫ్లెక్సీలు పెట్టి అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నాం. పీఏసీఎస్ విక్రయ కేంద్రం వద్ద కూపన్ల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకుంటాం. యూరియా దుర్వినియోగం కాకుండా నిఘా కొనసాగిస్తాం. – లాల్‌చంద్, ఏడీఏ, ఇల్లెందు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416